# వర్కింగ్ జర్నలిస్ట్

## సమాచార స్రవంతి

సంపుటి: 14
సంచిక: 06
జూన్ 2025
వెల: రూ. 5/-







జర్నలిస్టుల డిమాండ్స్ డే సందర్భంగా సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోల శ్రీబాలవీరాంజనేయస్వామి, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌లకు వినతిపత్రాలు అందజేస్తున్న ఫెడరేషన్ ప్రతినిధులు

విశాఖపట్నంలో




అనకాపల్లిలో




చిత్తూరులో




కార్మిక చట్టాల రద్దుకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలో ఫెడరేషన్ ఆందోళన

గుంటూరులో




SAVE JOURNALISM

PROTECT JOURNALIST

# వర్కింగ్ జర్నలిస్ట్ సమాచార స్రవంతి

**సంపుటి: 14 జూన్ 2025 సంచిక: 6**


## లోపలి పేజీల్లో...


సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది ........... 4
జర్నలిస్టుల డిమాండ్స్ డే ............. 5
రెవిన్యూ అధికారులకు ఏపిడబ్ల్యుజెఎఫ్ విజ్ఞాపన ................ 10
సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని అరెస్టు ........................ 17
జర్నలిస్టుల పిల్లలకు ఉచితంగా పుస్తకాల పంపిణీ ............ 19
జర్నలిస్టు చట్టాల రద్దుపై నిరసన .......................... 20
మహాటీవీ మీడియా హౌస్‌పై దాడి....................... 23
జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య...................... 25
జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ ---------------- 26
టి న్యూస్ యాంకర్ స్వేచ్ఛ ఆత్మహత్య ...................... 27
జర్నలిస్టుల సంక్షేమమే ఫెడరేషన్ లక్ష్యం ....... 28
కంచర్ల రామయ్య కన్నుమూత ...... 29



**సంపాదకులు**

**ఎ.అమరయ్య**

**వర్కింగ్ ఎడిటర్స్**

**ఎన్.కొండయ్య ఎం.ఎ.రవూఫ్**

**సంపాదకవర్గం**

జి.ఆంజనేయులు
ఎస్.వెంకట్రావు
వి.నవీన్‌రాజ్
ఎమ్. శ్రీనివాస్
బి.ఎన్.ప్రసాదరావు
వి.గోపి
వి.రామారావు
ఆర్.రామాంజనేయులు
బి. ఈశ్వరరావు
కె.వేణుగోపాలరావు
టి.మద్దులేటి
వి.భక్తవత్సలం
ఒ.శాంతి
ఎస్.మురళీశంకర్
కె.ఎస్.శంకరరావు
జి. శీనుబాబు
డి.మధుసూదనరావు

డిజైనర్:



**PUBLISHED, PRINTED AND EDITED BY**
**G. Anjaneyulu on behalf of**
**Andhra Pradesh Working**
**Journalists Federation**
H. No.1-7-9/A, Plot No.40, 402, Surabhi Sapphire, Golconda 'X' Roads, Musheerabad, Hyderabad-500 020, A.P.

**PRINTED AT**
**Prajashakthi,** M.B. Bhavan, Near RTC Cross Roads, Hyderabad-500 020.



**EDITOR**
**A.Amaraiah**
e-mail:editorworkingjournalist@gmail.com,
Cell: 9347921291



RNI No. APMUL/2009/37690


# వ్యవస్థల విధ్వంసానికి కారకులెవరు?

వ్యవస్థను విధ్వంసం చేస్తున్నది ఎవరు? సమాజాన్ని ప్రతిబింబించే శాసన రూపకల్పన వ్యవస్థ, అధికార నిర్వహణ వ్యవస్థ, న్యాయవ్యవస్థ, వాటి పనితీరును సమీక్షించే మీడియాలు ఎవరి బాధ్యతలు వారు నిర్వర్తిస్తున్నారా అని ప్రశ్నించుకుంటే అందుకు వచ్చే సమాధానం ఆందోళన కలిగిస్తున్నది. ఆయా వ్యవస్థలను వాటిని నిర్వహించేవారే విధ్వంసం చేస్తున్నారు. ఆ పరిస్థితి ఎందుకు ఎదురవుతున్నదో యోచించేందుకు కూడా ఎవరూ సమయం కేటాయించేందుకు సంసిద్ధంగా లేరు, సరికదా ఎదుటివారిని తప్పుపట్టేందుకు మాత్రం సదా సిద్ధంగా ఉంటున్నారు. ఇది ఎంతమాత్రం సమంజసం కాదు. సమాజానికి అవసరమైన శాసనాలు రూపొందించే వ్యవస్థ ఆ పని పక్కన బెట్టి ఇతర కార్యక్రమాలు చక్కబెట్టే పనిలో పడింది. ఐదేళ్ల పాటు పరిపాలించేందుకు, ఆ కాలంలో ప్రజాసంక్షేమాన్ని పట్టించుకునేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించాల్సింది పోయి రాజకీయ పక్షంగా తాము ఎల్లకాలం అధికారంలో కొనసాగేందుకు ఏం చేయాలా అని పనిలో పడ్డారు. అధికార నిర్వహణ ప్రజా ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని కొనసాగించాల్సిన వ్యవస్థ ఆ పని పక్కన బెట్టి అధికార పార్టీ అడుగులకు మడుగులొత్తడానికి తహతహలాడిపోతున్నారు. ఆ రెండు వ్యవస్థల పనితీరును సమీక్షించి దారిన పెట్టాల్సిన న్యాయవ్యవస్థ పనితీరుపై ఆ వ్యవస్థలో కీలక భూమిక పోషించేవారే వేలెత్తి చూపిస్తున్నారు. ఈ మూడు వ్యవస్థల్లోని మంచిచెడ్డలను ఎంచిచూడాల్సిన మీడియా ఏదో ఒక పక్షం చేరి వారి ప్రయోజనాలే సమాజ ప్రయోజనం అనే రీతిలో ప్రచారానికి నడుం బిగించారు. ఈ వ్యవహారంలో బలిపశువులవుతున్నవారు మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టులు. ప్రజాప్రయోజనం పరమావధిగా పనిచేయాల్సిన జర్నలిస్టులు యజమానుల ప్రయోజనమే పరమ ప్రయోజనంగా అడుగులు వేయక తప్పనిస్థితి. వ్యవస్థల నిర్వహణ అస్తవ్యస్తమైతే మొత్తం సమాజం దారి తప్పుతుంది. ఎవరి పని వారు చేయడానికి బదులు అవతలివారి తప్పులెంచడం ద్వారా తాము చేస్తున్న తప్పుల్ని ఎవరూ ప్రశ్నించే అవకాశం ఇవ్వకూడదనే ధోరణి బాగా ప్రబలిపోయింది. ఇదే ధోరణి మరికొంత కాలం కొనసాగితే సమాజానికి నాయకత్వం వహించే రాజకీయ వ్యవస్థపై నమ్మకం సడలిపోతుంది. అరాచకం, అవ్యవస్థ రాజ్యమేలుతుంది. అప్పుడు దానికి మేము బాధ్యులం కాదు అని ఎవరు చెప్పుకునే ప్రయత్నం చేసినా అది చెవిటివాని ముందు శంఖం ఊదిన తీరుగానే మారుతుంది. ఇప్పటికైనా మేలుకుని మనల్ని సంస్కరించుకునే ప్రయత్నం ఆరంభిస్తే కొంతకాలానికైనా దారిని పడగలం. ఆ దిశగా యోచన చేసేందుకు, అడుగులు వేసేందుకు అన్ని వ్యవస్థలకు నాయకత్వం వహిస్తున్నవారు ముందుచూపుతో మసలుకోవాలి.

# సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

## సమాచార శాఖ మంత్రి పార్ధసారథి హామీ

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని రాష్ట్ర సమాచార శాఖ మంత్రి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ప్రతినిధివర్గానికి హామీ ఇచ్చారు. జూన్ 11వ తేదీ రాష్ట్ర వ్యాప్తంగా ఫెడరేషన్ ఇచ్చిన పిలుపు మేరకు డిమాండ్స్ డే కార్యక్రమం సందర్భంగా వినతిపత్రం అందజేసిన ఫెడరేషన్ నాయకులకు మంత్రి స్పష్టమైన హామీ ఇచ్చారు. జర్నలిస్టుల పట్ల తమ ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించి సమస్యలు పరిష్కరిస్తుందని చెప్పారు. జర్నలిస్టులకు ఇంటి స్థలం కేటాయింపునకు స్వీకరించిన దరఖాస్తులు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయన్నారు. జర్నలిస్టుల ఆర్థికస్థితిని దృష్టిలో పెట్టుకుని గృహనిర్మాణానికి వీలుగా రుణసదుపాయం కల్పించేందుకు గల అవకాశాలను పరిశీలిస్తున్నామని ఆయన అన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో జర్నలిస్టులకు పెన్షన్ సదుపాయం ఉన్నదని, ఆ సదుపాయం రాష్ట్రంలోని జర్నలిస్టులకు కూడా కల్పించాలనే డిమాండ్‌పై ఇప్పటికే రాష్ట్రంలో వృద్ధాప్య పెన్షన్ సదుపాయం ఉన్నదని, జర్నలిస్టులకు విడిగా పెన్షన్ ఇచ్చేందుకు గల సాధ్యాసాధ్యాలను ముఖ్యమంత్రితో చర్చించిన అనంతరం పరిశీలిస్తామని వివరించారు. విస్తరించిన మీడియాను దృష్టిలో పెట్టుకుని మీడియా రంగ స్థితిగతులపై అధ్యయనం చేసేందుకు మీడియా కమిషన్ ఏర్పాటుచేయాలనే ప్రతిపాదన పరిశీలిస్తామన్నారు. జర్నలిస్టులకు అక్రిడిటేషన్ల జారీ ప్రక్రియలో ఇకపై ఎంతమాత్రం జాప్యం ఉండబోదన్నారు. పెరిగిన సోషల్ మీడియా, యూట్యూబర్లను దృష్టిలో పెట్టుకుని వారిని జర్నలిస్టులుగా పరిగణించే అంశం ఆలోచనలో ఉన్నదని, జాతీయ స్థాయిలో వారి గుర్తింపునకు సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించలేదని, మన రాష్ట్రంలో అందుకు గల అవకాశాలను అన్వేషిస్తున్నామన్నారు. జర్నలిస్టుల కోసం ప్రభుత్వం నియమించే కమిటీలలో జర్నలిస్టు సంఘాల ప్రాతినిధ్యంపై ప్రభుత్వం చాలా సానుకూలంగా ఉన్నదని, ఈ మేరకు గత యేడాది నవంబరులో సచివాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలోనే స్పష్టం చేశామన్నారు. ఆ మేరకు సంఘాల ప్రాతినిధ్యానికి సంబంధించి ఇప్పటికే కార్మిక శాఖకు లేఖ రాయడం జరిగిందన్నారు. జర్నలిస్టులపై దాడుల నివారణకు ఏర్పాటు చేయాల్సిన హైపవర్ కమిటీ, జిల్లా స్థాయి కమిటీల ప్రతిపాదన ప్రభుత్వం ముందుందన్నారు. విజయవాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో కలిసిన ఫెడరేషన్ ప్రతినిధివర్గంతో ఆయన చాలా వివరంగా అన్ని సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతినిధివర్గంలో ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎస్.వెంకట్రావు, జి.ఆంజనేయులు, రాష్ట్ర నాయకులు ఎ.కొండబాబుతో పాటు ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.కలిమిశ్రీ, ఎం.బి.నాథన్, చొప్పరపు శేఖర్, బాషా తదితరులున్నారు. అనంతరం ప్రతినిధివర్గం ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఫెడరేషన్ నాయకులతో కలిసి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.



# జర్నలిస్టుల డిమాండ్స్ డే



ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 11వ తేదీ జర్నలిస్టులు డిమాండ్స్ డే కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర రాజధాని నుంచి మండల కేంద్రం వరకు అన్ని చోట్లా ప్రజాప్రతినిధులకు, అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. 11 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఇచ్చి జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి వివరించారు. రాష్ట్ర రాజధానిలో సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధికి ఫెడరేషన్ ప్రతినిధివర్గం వినతిపత్రం అందజేసి సవివరంగా సమస్యల గురించి చెప్పారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించారు. ఒంగోలులో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల శ్రీవీర బాలాంజనేయస్వామికి ప్రకాశం జిల్లా నాయకులు వినతిపత్రం అందించారు. ధర్మవరంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి



సత్యకుమార యాదవకు స్థానిక ఫెడరేషన్ నాయకులు కలిసి జర్నలిస్టుల సమస్యలను వివరించి వినతిపత్రం సమర్పించారు. జిల్లా కేంద్రాల్లో కలెక్టర్లు, ఇతర ప్రాంతాల్లో డిఆర్‌వోలు, మండల రెవిన్యూ అధికారులకు జర్నలిస్టుల సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. ఒంగోలు, విజయనగరం, ఎన్టీఆరణ జిల్లాల్లో దాదాపు అన్ని మండలాల్లో వినతిపత్రాలను అందజేశారు. కర్నూలు, అనంతపురం, అన్నమయ్య, సత్యసాయి, చిత్తూరు, తిరుపతి జిల్లాల జర్నలిస్టులు జిల్లా కలెక్టర్లకు, ఆర్‌డివోలకు వినతులు అందించారు. విశాఖపట్నం, అనకాపల్లి, ఏలూరు, నెల్లూరు, గుంటూరు కేంద్రాల్లో జర్నలిస్టుల స్పందన బాగా కనిపించింది. కొన్ని మండల కేంద్రాల్లో ఒకరిద్దరు ఫెడరేషన్ ప్రతినిధులున్నప్పటికీ మండలాధికారులకు విజ్ఞప్తులను ఇచ్చారు. మొత్తం మీద జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం దృష్టికి తీసుకువెళ్ళడంలో ఫెడరేషన్ సఫలీకృతమైంది. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ



**శ్రీ కొలుసు పార్థసారధి,** ది: 11-05-2025

గౌరవ సమాచార, గృహనిర్మాణ శాఖ మంత్రి,

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం,

అమరావతి.

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు్ల ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) ఇచ్చిన రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా జూన్ 11వ తేదీ రాష్ట్రంలోని అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి డిమాండ్స్ డే పాటిస్తూ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయించింది. అందుకు అనుగుణంగా జర్నలిస్టుల సమస్యల గురించి వినతిపత్రాన్ని అందజేస్తున్నాం. మీ పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించి మిగిలిన సమస్యల పరిష్కారానికి వీలుగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లవలసిందిగా కోరుతున్నాం.

**1. జర్నలిస్టుల ఇంటిస్థలాల కేటాయింపు:**

ఆంధ్రప్రదేశ్‌లో జర్నలిస్టులకు ఇళ్లస్థలాల కేటాయింపు సమస్య చాలాయేళ్లుగా అపరిష్కృతంగా ఉంది. ఎన్నికల సమయంలోనే జర్నలిస్టులకు ఇంటి స్థలం కేటాయిస్తామని ప్రణాళికలో ప్రకటించడంతో అందరూ ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలోని జర్నలిస్టులకు ఒకరికి మూడు సెంట్లు చొప్పున కేటాయిస్తామని గత ప్రభుత్వం జీవో జారీ చేసి దరఖాస్తులను స్వీకరించింది. వారికి స్థలాల కేటాయింపు చేయడంతో పాటు అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్లస్థలాలు కేటాయించేందుకు వీలుగా ప్రభుత్వం తగిన ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతున్నాం. ఇళ్లు కట్టుకునేందుకు తగిన ఆర్థిక సహాయం అందించాలని కోరుతున్నాం. జర్నలిస్టుల ఇంటి నిర్మాణానికి రుణ సదుపాయం కల్పించేందుకు వీలుగా ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

జర్నలిస్టుల ఇంటిస్థలాలకు సంబంధించి రాష్ట్రంలోని విజయవాడ నున్న సొసైటి, విశాఖపట్నంలోని సొసైటీ, అనంతపురం జిల్లా హిందూపురంలో జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 2009 ఫిబ్రవరిలో విశాఖపట్నం జర్నలిస్టులకు ఇంటిస్థలాలు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులకు అనుగుణంగా జర్నలిస్టులు ప్రభుత్వానికి నిర్ణయించిన ధర చెల్లించినప్పటికీ ఇప్పటివరకు స్థలాలు అప్పగించలేదు. అనంతపురం జిల్లా హిందూపురంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించినప్పటికీ వారికి అప్పగించలేదు.

గిరిజన ప్రాంతాల్లోని జర్నలిస్టులకు సమీపంలోని మైదాన ప్రాంతాల్లో ఇళ్లస్థలాల కేటాయింపు చేయాలని అభ్యర్థిస్తున్నాం.

రాష్ట్రంలోని జర్నలిస్టుల ఇళ్లస్థలాల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం తక్షణం తగిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు్ల ఫెడరేషన్ కోరుతున్నది.

**2. మీడియా కమిషన్ ఏర్పాటుచేయాలి:**

మారిన పరిస్థితుల్లో జర్నలిజం వృత్తి ప్రమాదంలో పడింది. జర్నలిస్టుకు రక్షణ కొరవడంది. రక్షణ లేని వృత్తిగా జర్నలిజం ప్రపంచదేశాల్లో 151వ స్థానంలో ఉంది. ప్రజాస్వామిక దేశమైనప్పటికీ జర్నలిస్టుల ఉద్యోగ భద్రత, పనిపరిస్థితులు, ఇతర సదుపాయాలు తదితర అంశాలన్నింటిపై అధ్యయనం చేసేందుకు మెరుగైన చర్యలు చేపట్టేందుకు వీలుగా ప్రభుత్వం మీడియా కమిషన్‌ను ఏర్పాటుచేయాలని కోరుతున్నాం. ఈ కమిషన్ పనిచేస్తున్న లేదా రిటైర్డ్ హైకోర్టు

న్యాయమూర్తి నేతృత్వంలో సీనియర్ జర్నలిస్టులు, ఉన్నత అధికారులతో ఆరునెలల లోపు నివేదిక అందజేసేలా తగినచర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

**3. జర్నలిస్టులకు పెన్షన్:**

దేశంలోని వివిధ రాష్ట్రాల్లో జర్నలిస్టులకు ప్రభుత్వాలు పెన్షన్ పథకాన్ని అమలు చేస్తున్నాయి. మనరాష్ట్రంలో జర్నలిస్టులకు పెన్షన్ పథకాన్ని అమలు చేసేందుకు గల అవకాశాలను పరిశీలించేందుకు వీలుగా ఒక కమిటీని నియమించాలని కోరుతున్నాం. అ కమిటీ నివేదిక ఆధారంగా పెన్షన్ పథకాన్ని అమలుచేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

**4. అక్రిడిటేషన్ కమిటీలో ఎపిడబ్ల్యుజెఎఫ్, ఎపిబిజెఎలకు ప్రాతినిధ్యం:**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కార్మిక శాఖ సమాచారం ఆధారంగా సమాచార శాఖ రాష్ట్ర, జిల్లా అక్రిడిటేషన్ల కమిటీల నియామకంలో ఎపిడబ్ల్యుజెఎఫ్, ఎపిబిజెఎలకు ప్రాతినిధ్యం కల్పించింది.  అందుకు అనుగుణంగా ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. అనంతర కాలంలో ఆ ఉత్తర్వుల అమలుపై వెనక్కు తగ్గింది. ఆయా కమిటీలలో ఎ.పి.డబ్ల్యు.జె.ఎఫ్‌కు, ఎపిబిజెఎకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతున్నాం.

**5. జర్నలిస్టు కమిటీలు:**

జర్నలిస్టులపై జరిగే దాడులను అరికట్టేందుకు వీలుగా రాష్ట్రంలో హెూంశాఖ మంత్రి నేతృత్వంలో హైపవర్ కమిటీ, జిల్లాలో ఉన్నత పోలీసు అధికారులతో కూడిన కమిటీలు వేసేందుకు ఉత్తర్వులు ఉన్నప్పటికీ కమిటీలు లేవు. జర్నలిస్టుల సంక్షేమం కోసం వర్కింగ్ జర్నలిస్టు వెల్‌ఫేర్ ఫండ్  కమిటీ కూడా ఏర్పాటు కాలేదు. వర్కింగ్ జర్నలిస్టు వెల్‌ఫేర్ పండ్ కమిటీని తక్షణమే పునరుద్ధరించి ఈ విపత్కర పరిస్థితుల్లో కష్టాల పాలవుతున్న జర్నలిస్టులను ఆదుకునేందుకు వీలుగా తగిన మార్గదర్శకాలు రూపొందించడంతో పాటు  తగిన నిధులు కేటాయించాలని కోరుతున్నాం. ఈ కమిటీల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. వర్కింగ్ జర్నలిస్టు వెల్‌ఫేర్ ఫండ్‌కు 50 కోట్ల రూపాయలను కేటాయించాలని కోరుతున్నాం.

**6. మీడియా అకాడెమీ బలోపేతం చేయాలి:**

రాష్ట్రంలో జర్నలిస్టుల కోసం సి.రాఘవచారి మీడియా అకాడెమీ పనిచేస్తున్నది. గవర్నింగ్ కౌన్సిల్ ఏర్పాటు లేదు. మొత్తం మీడియాను ఒక ఛత్రం కిందకు తెచ్చి అందుకు అనుగుణంగా విధివిధానాలు రూపకల్పన చేయాలి. అకాడెమీ పని సజావుగా సాగేందుకు వీలుగా ప్రత్యేక నిధి కేటాయించాలి. అకాడెమీ గవర్నింగ్ కౌన్సిల్‌లో ఎపి వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్), ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్ (ఎపిబిజెఎ)లకు ప్రాతినిధ్యం కల్పించాలి. ప్రింట్, బ్రాడ్‌కాస్ట్, డిజిటల్ మీడియాల్లో వస్తున్న నిత్యనూతన విధానాలను మీడియాలో పనిచేస్తున్నవారికి అందుబాటులోకి తెచ్చే విధంగా శిక్షణ తరగతులు, పునశ్చరణ తరగతులు, వివిధ అంశాలపై సదస్సులు, సమావేశాలు, గోష్టులు ఏర్పాటుచేయాలి. వీటన్నింటి నిర్వహణకు వీలుగా మీడియా అకాడెమీకి ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని కోరుతున్నాం.

**7. జర్నలిస్టుల అవార్డులు:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతియేటా సమాచార శాఖ అధ్వర్యంలో జర్నలిస్టులకు ఇవ్వాల్సిన అవార్డులను కొన్ని సంవత్సరాలుగా ఇవ్వడం లేదు. రాష్ట్ర విభజన అనంతరం అవార్డులు ఇస్తారని జర్నలిస్టులు ఎదురుచూశాడు. వైఎస్సార్

జీవన సాఫల్య అవార్డు పేరిట కొందరు జర్నలిస్టులకు అవార్డులు ఇచ్చారు.  గతం నుంచి జర్నలిస్టు రంగంలో ప్రముఖుల పేరిట ఇస్తున్న ఈ అవార్డులు ఇచ్చేందుకు వీలుగా ప్రభుత్వం తగిన చర్యలు గైకొనాలని కోరుతున్నాం.

**8. జర్నలిస్టుల ఉద్యోగ భద్రత:**

వర్కింగ్ జర్నలిస్టు చట్టంతో పాటు ఇతర కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తూ జర్నలిస్టులు, ఇతర సిబ్బందిని అక్రమంగా తొలగిస్తున్న యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలను తీసుకోవాలని కార్మిక శాఖను ఆదేశించాలని కోరుతున్నాం. అదేవిధంగా అక్రమంగా తొలగించిన జర్నలిస్టులు, ఇతర సిబ్బందిని తిరిగి విధుల్లోకి తీసుకునే విధంగా కార్మిక శాఖ తగు చర్యలు తీసుకునేందుకు అవసరమైన అదేశాలు ఇవ్వాలని కోరుతున్నాం.

**9. కార్మిక బీమా సదుపాయం వర్తింపజేయాలి:**

కార్మిక శాఖ పరిధిలో అసంఘటిత రంగంలో ఉన్న కార్మికులకు కల్పిస్తున్న బీమా పథకం జర్నలిస్టులకు వర్తింపజేసేందుకు వీలుగా కార్మిక శాఖ కమిషనర్ ప్రతిపాదనలు పంపారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ అంశంపై ప్రభుత్వం సానుకూలమైన నిర్ణయం తీసుకుని జర్నలిస్టులకు బీమా సదుపాయం కల్పించాలని కోరుతున్నాం.

**10. జర్నలిస్టుల ఆరోగ్యబీమా:**

ప్రస్తుతం జర్నలిస్టులకు అమలవుతున్న ఆరోగ్యబీమా పథకం అమలు తీరుతెన్నులపై జర్నలిస్టుల్లో అనేక సందేశాలు తలెత్తుతున్నాయి. చాలాయేళ్ళుగా ఈ పథకం అమలవుతున్నా ప్రతియేటా రెన్యువల్ చేయడంలో చాలా జాప్యం జరుగుతున్నది. ఈ జాప్యాన్ని నివారించి క్రమం తప్పకుండా పథకం కొనసాగేలా చూడాలని కోరుతున్నాం.  ఈ పథకం అమలుపై ఎటువంటి సమీక్ష లేదు. జర్నలిస్టుల ఆదాయాలు అతిస్వల్పం. తెల్ల రేషన్ కార్డులు లేకపోయినప్పటికీ ఆరోగ్యబీమా పథకం కార్డులు జారీ చేయాలి. పథకం అమలుపై ఎప్పటికప్పుడు సమీక్ష చేసేందుకు వీలైన ఏర్పాట్లు ఉండాలి.

**11. జర్నలిస్టుల వృద్ధాశ్రమ ఏర్పాటు:**

జర్నలిస్టుల సామాజిక భద్రత విషయంపై ప్రభుత్వం శ్రద్ధ పెట్టాలని కోరుతున్నాం. రాష్ట్ర రాజధాని మొదలు మండల కేంద్రం వరకు ఉద్యోగ భద్రత, ఇతర సదుపాయాలు లేకుండా పనిచేస్తున్న జర్నలిస్టులు వృద్ధాప్యంలో ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అటువంటి వృద్ధ జర్నలిస్టుల స్థితిగతులు, అవసరాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర కేంద్రంలో వృద్ధాశ్రమం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

పై సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం తగిన విధంగా స్పందించి పరిష్కరించాలని కోరుతున్నాం.

అభివందనాలతో.

భవదీయులు

అధ్యక్షులు                                        ప్రధానకార్యదర్శి

ప్రతినిధులతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. కొత్తగా యేర్పడిన ప్రభుత్వం యేడాది సంబరాలు జరుపుకుంటున్న తరుణంలో పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల కోర్కెల పరిష్కారంపై కూడా దృష్టి సారిస్తే బాగుంటుందనే అభిప్రాయం జర్నలిస్టుల్లో సర్వత్రా నెలకొన్నది.























# రెవెన్యూ అధికారులకు ఎపిడబ్ల్యుజెఎఫ్ విజ్ఞాపన

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) ఆధ్వర్యాన ఎన్‌టిఆర్ జిల్లావ్యాప్తంగా డిమాండ్స్ డే పాటించారు. ఈ సందర్భంగా జిల్లాలో 14 చోట్ల వినతిపత్రాలను అందించారు. ఎన్‌టిఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియకు ఫెడరేషన్ నేతలు వినతిపత్రం అందజేశారు. జిల్లావ్యాప్తంగా రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో ఆర్‌డిఒలను, మండల కేంద్రాల్లో తహశీల్దార్లను కలిసి వినతిపత్రాలను సమర్పించారు. జర్నలిస్టుల సమస్యల గురించి అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చారు. ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.కలిమిశ్రీ, ఎం.బి.నాథన్, రాష్ట్ర నాయకులు కొండబాబు, నగర నాయకులు చొప్పా రాఘవేంద్ర శేఖర్, ఎన్.నరేంద్ర కుమార్, బాషా, జోతిర్మయి, ఫణీశ్వరి పాల్గొన్నారు. ఇంకా నందిగామలో ఆర్‌డిఒ బాలకృష్ణకు ఫెడరేషన్ నేతలు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా నాయకులు ఆకుల వెంకట నారాయణ, నాయకులు శ్రీనివాసరావు, మీడియా ప్రతినిధులు అనిల్, సురేష్, ఖుద్దు, చందు, రాజు, సాంబ, నరసింహ, మీరా, సీతారామ్ పాల్గొన్నారు. పటాన్ మీరా హుస్సేన్ ఖాన్ సంఘీభావం తెలియజేశారు. ఇబ్రహీంపట్నం తహశీల్దార్

కార్యాలయం వద్ద జర్నలిస్టులు ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ సాయి మహేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నేతలు ఎ.బాబు, ఎం.రాఘవులు, ఎస్.నాగరాజు, అడపా శివ, సీహెచ్ మురళి, సత్య, బొమ్మ గోపి, వి. నాగరాజు, మేకల భాను, సీహెచ్ రాంబాబు, సల్మాన్, దాసి ప్రతాప్, పల్లె నరేష్, ఎం.రమేష్ పాల్గొన్నారు. జగ్గయ్యపేట తహశీల్దారు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ కెశ్రీదేవిని నేతలు కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నేతలు వి.రవిశేఖర్, జె.వెంకటరావు, కె.శివరామకష్ణ, ఏ.శివాజీ, ఎం.విజయపాల్ పాల్గొన్నారు. గంపలగూడెం తహశీల్దారు కార్యాలయంలో నేతలు జి.అంజయ్య, రాయల ఆంజనేయు మూర్తి వినతిపత్రం అందజేశారు. రెడ్డిగూడెంలో తహసీల్దారు జె.సుశీలా దేవికి మెమోరాండం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నేతలు కె శ్రీనివాసరావు, సిహెచ్. విజయ కుమార్, బి.సి.హెచ్.వి.సూర్యనారాయణ, ఎం.ప్రసాదరావు, కె.శ్రీను, సిహెచ్.ప్రవీణ్, సిహెచ్. సుబ్బారావు, ఎం.వంశీ, బి.ప్రసాదరావు పాల్గొన్నారు. వత్సవాయి, పెనుగంచిప్రోలు తహశీల్దారు కార్యాలయాల్లో నాయకులు కరిచే రత్నబాబు, గుడేటి దాస్, పర్వీన్ వినతిపత్రాలు అందించారు. మైలవరంలో డిప్యూటీ తాసిల్దారు బానోతు మోరియాకు నేతలు సిహెచ్.రాజారెడ్డి, మురళి బాబు, హరికష్ణ, కష్ణ ప్రసాదు విజ్ఞాపన పత్రం అందించారు. ఎ.కొండూరు డిప్యూటీ తహశీల్దారు యు.రాజ్ కుమార్‌కు నాయకులు మరీదు జమలయ్య, మరిది చెన్నారావు ఎండి అబ్దుల్లా, ఎండి అక్బర్ వినతివత్రం అందించారు. జి.కొండూరు డిప్యూటీ తహశీల్దారు పి.విజరు కుమార్‌కు నాయకులు వీసం సురేష్ బాబు, చింతకాయల రాంబాబు, మంతెన శ్రీనివాస్, కూరపాటి ప్రకాష్, ప్రసాద్, విస్సన్నపేట తహశీల్దారు కార్యాలయంలో కృష్ణ వినతిపత్రాలు అందజేశారు.










జర్నలిస్టులకు
3 సెంట్లు ఇళ్ల స్థలం
కేటాయించాలి












మైలవరం నియోజక వర్గం












OPPO Reno11 5G













ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్
ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్
ఏపీ స్మాల్ అండ్ మీడియం పేపర్స్ అసోసియేషన్
APWJF
APBJA & APSAMA

















## దివాకర్ కన్నుమూత



ప్రజాశక్తి విశాఖపట్నం ఎడిషన్‌లో పనిచేసిన దివాకర్ మృతి చెందారు. ఆయన కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. దాదాపు 15 సంవత్సరాల పాటు ప్రజాశక్తిలో పని చేసిన దివాకర్, ఆ తర్వాత కాలంలో విద్యుత్ శాఖలో పిఆర్‌ఒగా పని చేశారు. ఆయన భార్య రమణి విశాఖ ఎడిషన్ తొలిరోజుల్లో ఎడిటోరియల్ బోర్డులో సేవలందించారు. దివాకర్ పని తీరు ఎంతో స్ఫూర్తిదాయకం. అందరితో స్నేహపూర్వకంగా వ్యవహరించేవాడు. వివిధ పత్రికలు, ఛానళ్ల పనిచేసే జర్నలిస్టులకు మిత్రుడు. దివాకర్ కుమారుడు శివతేజ పదేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఆయన మరణవార్త తెలిసిన వెంటనే ఫెడరేషన్ నాయకులు గంట్ల శీనుబాబు, పి.నారాయణ్, జి.శ్రీనివాసరావు తదితరులు ఆయన ఇంటికి వెళ్ళి నివాళులర్పించారు. ఆయన మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

## సాక్షి పత్రిక విలేకరి రాముపై దాడి

తూర్పుగోదావరి జిల్లా అయినవిల్లి మండలం సాక్షి దినపత్రిక విలేకరి రాముపై ఇంటికెళుతున్న సమయంలో శివితేజ స్కూల్ సమీపంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు దాడిచేసి, తీవ్రంగా గాయపరిచారు. ఈ ఘటనలో రాము తీవ్రంగా గాయపడి అమలాపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. రాముపై దాడిని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ కాకినాడ జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వి.నవీన్‌రాజ్, ఎం.లక్ష్మణ్‌లు ఖండించారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

# సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని అరెస్టు

అమరావతి ప్రాంత మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు, వాడపల్లి కృష్ణంరాజులను పోలీసులు అరెస్టు చేశారు. సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు, మరో జర్నలిస్టు వాడపల్లి కృష్ణంరాజుపై విజయవాడ పోలీసులు జూన్ 8వ తేదీ కేసు నమోదు చేశారు. సాక్షి ఛానల్‌లో కొమ్మినేని జూన్ 6వ తేదీ నిర్వహించిన చర్చా వేదికలో పాల్గొన్న కృష్ణంరాజు అమరావతి ప్రాంత మహిళలపై చేసిన వ్యాఖ్యలతో తెలుగుదేశం పార్టీకి చెందిన మహిళలు విజయవాడ పటమట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు చేశారు. సాక్షి లైవ్ డిబేట్లో అమరావతిపై చేసిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు, జాతీయ మహిళా కమిషన్‌కు, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు వేరువేరుగా ఫిర్యాదులు చేశారు. ఈ అంశంపై అమరావతి ప్రాంతంలోని వివిధ వర్గాల నుంచి తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీలు రాష్ట్రవ్యాప్తంగా స్పందించాయి. అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, చర్చ నిర్వహించిన సాక్షి ఛానల్ ప్రసారాలు నిలిపివేయాలని రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేశారు. సాక్షి కార్యాలయాల ముందు నిరసన కార్యక్రమాలు నిర్వహించడంతోపాటులను కూడా సాక్షి దినపత్రికల ప్రతులను తగులు పెట్టారు. కొన్నిచోట్ల కార్యాలయాలకు దాడులు చేసి విధ్వంసాలకు పాల్పడ్డారు. చర్చ కార్యక్రమం సాక్షి టీవీ ఛానల్లో జరిగినందున వైఎస్ భారతి, వైయస్ జగన్మోహన్ రెడ్డిలు కూడా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

**అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యల వివాదం**



**తుళ్లూరులో కేసు నమోదు**

సాక్షి ఛానల్ లో జరిగిన చర్చ కార్యక్రమంలో అమరావతిపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై తుళ్లూరు పోలీస్ స్టేషన్ లో కంభంపాటి శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొమ్మినేని శ్రీనివాసరావు వాడపల్లి కృష్ణంరాజుతో పాటు సాక్షి యాజమాన్యంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలియజేశారు. ఎస్సీ ఎస్టీ వేధింపుల కేసుతోపాటు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. తుళ్లూరుతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలోని పోలీస్ స్టేషన్లో కూడా ఇదే అంశంపై కేసులు నమోదయ్యాయి.

**పోలీసుల అదుపులో కొమ్మినేని**

హైదరాబాద్‌లో కొమ్మినేని శ్రీనివాసరావును ఆయన ఇంట్లో విజయవాడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తుళ్ళూరు కేసులో అరెస్టు చేస్తున్నట్లు పోలీసులు తెలియజేసి ఆయనపై నమోదైన ఎఫ్.ఐ.ఆర్. కాపీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చర్చా కార్యక్రమంలో విశ్లేషకునిగా వచ్చిన కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలపై తదుపరి చర్చ కొనసాగించలేదని, ఆ విషయంపై అదే షోలో జరిగిన సంఘటనకు చింతిస్తున్నట్టు క్షమాపణ చెప్పినట్టు ఆయన వివరించారు. కొమ్మినేని అరెస్టుపై రాష్ట్రంలోని జర్నలిస్టులు ఆందోళన వ్యక్తం చేశారు. చర్చా కార్యక్రమంలో విశ్లేషకులు చేసే వ్యాఖ్యలకు సంబంధం లేకపోయినప్పటికీ కేసులు పెట్టడం రాజకీయ ప్రేరేపితమైన అంశమని పలువురు అమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

**ఫెడరేషన్ ఖండన**

సాక్షి మీడియా సంస్థలపై రాష్ట్రంలోని వివిధ

ప్రాంతాల్లో జరిగిన దాడులను ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ తీవ్రంగా ఖండిచింది. సాక్షి టీవీలో ఇటీవల ప్రసారమైన కార్యక్రమంలో రాజధాని ప్రాంత మహిళలపై అనుచితమైన వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టుపై, కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావుపై తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. ఆయనను అరెస్టు చేశారు. ఈ అంశంపై శ్రీకాకుళం, విజయవాడ, గుంటూరుతో సహా వివిధ ప్రాంతాలలోని సాక్షి మీడియా కార్యాలయాలపై దాడులు జరిగాయి. మీడియాను భయభ్రాంతం చేసే రీతిలో జరిగే దాడులను నివారించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. టీవీ చానళ్ళలో జరిగే చర్చాగోష్టులలో అవాంఛనీయ సంఘటనలను నివారించేందుకు వీలుగా రాష్ట్రస్థాయిలో, జిల్లా స్థాయిలో కేంద్ర ప్రభుత్వం సూచించిన రీతిలో మానిటరింగ్ కమిటీల ఏర్పాటు తక్షణమే చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సాక్షి టీవీలో ప్రసారమై, వివాదాస్పదమైన అంశాన్ని ఆ కమిటీ ద్వారా విచారణ జరిపించాలని విన్నవించుకుంటున్నామని ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎస్ వెంకట్రావు, జి ఆంజనేయులు కోరారు.

**సుప్రీంకోర్టు ఊరట**

పోలీసులు అరెస్టు చేసిన కొమ్మినేని శ్రీనివాసరావును కోర్టులో హాజరుపరచగా పద్నాలుగు రోజుల రిమాండ్ విధించారు. అదే సమయంలో కేసులో నమోదు చేసిన ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ సెక్షన్లను తొలగించాలని కోర్టు ఆదేశించింది. బెయిలు నిమిత్తం కొమ్మినేని సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీంకోర్టు బెయిలు మంజూరు చేయాలని కోరుతూ ఆదేశించింది. పిటిషనర్ నిర్వహించే షోలో తిరిగి అటువంటి వ్యాఖ్యలు చేయకుండా లేదా అనుమతించకుండా చూడాలని హెచ్చరించింది.

షోలో వ్యాఖ్యలు చేసిన కృష్ణంరాజును పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు. అనంతరం మూడు రోజుల పోలీసు కస్టడీకి అనుమతించారు. 18 రోజుల పాటు జైల్లో ఉన్న ఆయన బెయిలుపై జూన్ 30వ తేదీ బయటకు వచ్చారు.



**జర్నలిస్టుల పిల్లలు ప్రైవేటు పాఠశాలలో రాయితీపై చదువుకునేందుకు వీలు కల్పించాలని కోరుతూ అనంతపురం జిల్లా కలెక్టరుకు వినతిపత్రం అందజేస్తున్న ఫెడరేషన్ నాయకులు**

## ప్రజాశక్తి విలేకరి శంకరరావు మృతి



విజయనగరం జిల్లా భోగాపురం ప్రజాశక్తి విలేకరిగా పనిచేస్తున్న నానుబాల శంకరరావు(40) జూన్ 21న మృతి చెందారు. మూడేళ్ల నుంచి ప్రజాశక్తిలో విలేకరిగా పనిచేస్తున్న శంకరరావు ఇటీవల బ్రెయిన్‌స్ట్రోక్‌తో అనారోగ్యం పాలయ్యారు. విజయనగరంలోని ఆసుపత్రికి వైద్యచికిత్స నిమిత్తం తరలించిన అనంతరం ఆయన మరణించారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. శంకరరావు మృతి పట్ల ఫెడరేషన్ విజయనగరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమేష్‌నాయుడు, వ్యాస్‌లు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

## ఫోటో జర్నలిస్టు బాషా మృతి



హైదరాబాద్‌లో ఫోటో జర్నలిస్టుగా పనిచేస్తున్న భాషా గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతి పట్ల నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్టు తెలంగాణ కన్వీనర్ ఎం.ఎ. రవూఫ్ ప్రగాఢ సంతాపం తెలియజేశారు.



# జర్నలిస్టుల పిల్లలకు ఉచితంగా పుస్తకాల పంపిణీ

## ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో కార్యక్రమం

అనంతపురం జిల్లాలో గతంలో ఎప్పుడూ లేనివిధంగా వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. స్థానిక క్లబ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, బాలాజీ సంస్థల చైర్మన్ పల్లె కిషోర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ ఉపాధ్యక్షులు, అనంతపురం జిల్లా కార్యదర్శి రేపటి రామాంజనేయులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముందుగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన ఉరవకొండ హెచ్ఎంటీవీ రిపోర్టర్‌కు కలెక్టర్, ఎమ్మెల్యే, జర్నలిస్టులు ఘనంగా నివాళులర్పించారు జిల్లాలో వివిధ ఛానళ్లలో పత్రికల్లో పని చేస్తున్న సుమారు 270 మంది జర్నలిస్టులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేశారు. ఒకటవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదివే పిల్లలకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, జిల్లా కలెక్టర్ ఈ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి రేపటి రామాంజనేయులు మాట్లాడుతూ జిల్లాలో చాలామంది పేద జర్నలిస్టులు ఉన్నారని, ప్రతి సంవత్సరం వారి పిల్లల చదువులకు చాలా ఖర్చులు చేస్తుంటారన్నారు. ఇలాంటి జర్నలిస్టులకు ఎంతోకొంత సాయం చేయాలన్న ఉద్దేశంతోనే ఈ పుస్తకాల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ దృష్టికి జర్నలిస్టుల సమస్యలు తీసుకెళ్లామని కచ్చితంగా వాటన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. జర్నలిస్టుల పిల్లలందరికీ ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఉచితంగా విద్య అందించాలని డిమాండ్ చేశారు. దీనిపై ఇప్పటికే కలెక్టర్ సానుకూలంగా స్పందించారని రేపటి రామాంజనేయులు చెప్పారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తన తండ్రి కూడా ఒకప్పుడు జర్నలిస్టుగా పని చేశారని గుర్తు చేసుకున్నారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో ఎంతో మంచి కార్యక్రమం చేశారని ఆయన అభినందించారు. జర్నలిస్టుల సమస్యలను కచ్చితంగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులు తమ కుటుంబ సభ్యుల లాంటి వారిని వారి పిల్లల కోసం పుస్తకాలు ఇవ్వడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఖచ్చితంగా అసెంబ్లీలో ప్రస్తావిస్తానని ఆమె హామీ ఇచ్చారు. మరోవైపు బాలాజీ, పివికేకే విద్యా సంస్థల చైర్మన్ పల్లె కిషోర్ రెడ్డి మాట్లాడుతూ తాను తొలిసారి ప్రెస్ క్లబ్ కు రావడం చాలా సంతోషంగా ఉందని, ఇది తన సొంత ఇంటికి వచ్చినట్టు ఉందన్నారు. ఇక్కడ ఉన్న వారంతా తమ కుటుంబంలో భాగమేనని జర్నలిస్టుల పిల్లలకు పుస్తకాలు ఇవ్వడం.. తమకు దక్కిన అదృష్టమని అన్నారు. భవిష్యత్తులో కూడా ఎలాంటి సాయం కావాలన్నా చేస్తామన్నారు. ఉరవకొండలో రోడ్డు ప్రమాదంలో మరణించిన జర్నలిస్టు కుమారుడి చదువు బాధ్యతలు తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు.



# జర్నలిస్టుల చట్టాల రద్దుపై నిరసన



కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన జర్నలిస్టుల చట్టాలు రెండింటిని పునరుద్ధరించాలని కోరుతూ జూన్ 9న రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్సు ఫెడరేషన్ నిర్ణయం మేరకు వివిధ జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు జరిగాయి. జూన్ 9న వివిధ రూపాలలో నిరసనలు నిర్వహించారు. నల్ల బ్యాడ్జీలు ధరించటం, ధర్నా, ప్రదర్శన, జాతీయ కార్మిక సంఘాల నాయకులతో సమావేశాలు ఏర్పాటు తదితర రూపాలలో కార్యక్రమాలను చేపట్టారు. జిల్లా శాఖల కార్యవర్గాలు సమావేశమై తమ కార్యాచరణను రూపొందించుకున్నాయి. ఆ మేరకు జిల్లాల వారీగా జరిగిన కార్యక్రమాల వివరాలివి.

**విశాఖపట్నం**

విశాఖపట్న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట వర్కింగ్ జర్నలిస్టులు నల్ల బ్యాడ్జీలతో శాంతియుత నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీను బాబు, జిల్లా అధ్యక్షులు పి..నారాయణలు మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టులకు సంబంధించిన చట్టాలను తక్షణమే పునరుద్ధరించాలని వీరు డిమాండ్ చేశారు. ఇప్పటికే వర్కింగ్ జర్నలిస్టుల పరిస్థితి దయనీయంగా మారిందని అభిప్రాయపడ్డారు. జర్నలిస్టులకు పూర్తిస్థాయిలో సంక్షేమం కొరవడిందని,అలాగే ఉద్యోగ భద్రతతో పాటు వేతనాలు




చెల్లింపులు,దాడుల నియంత్రణకు సంబంధించి సరైన చట్టాలు లేవని అందువల్లే మీడియా కమిషన్ ఏర్పాటును తాము ఎప్పటినుంచో స్వాగతిస్తున్నామన్నారు. వీటితోపాటు ప్రభుత్వ కమిటీల్లో జర్నలిస్టుల సంఘాలకు విధిగా ప్రాతినిధ్యం కల్పించాల్సిందేనన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ కార్యదర్శి జి. శ్రీనివాసరావు, బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల జిల్లా అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు, కార్యదర్శి కె. మదన్. చిన్న మధ్య తరహా పత్రికల సంఘం అధ్యక్షుడు జగన్మోహన్, జర్నలిస్టు నాయకులు వి. శ్రీనివాసరావు, కృష్ణమూర్తి నాయుడు, శ్రీనివాసనాయుడు, కామన్న, కేవీ శర్మ, చక్రి, నాయుడు, సత్యనారాయణ. నగేష్ బాబు. శ్రీ లత, మాధవి గౌతమ్, వినయ్, శివ పాల్గొన్నారు.

**గుంటూరు**

ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్), ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్టింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ (ఎపిబిజెఎ) గుంటూరు



జిల్లా శాఖల ఆధ్వర్యంలో జూన్ 9న తేదీ ఉదయం 10 గంటలకు గుంటూరు కలెక్టరేట్ వద్ద జర్నలిస్టులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు కనపర్తి రత్నాకర్ మాట్లాడుతూ,జర్నలిస్టులకు ఉన్న హక్కులను కేంద్రం పునరుద్ధరించాలి.రద్దు చేసిన చట్టాలను మళ్లీ అమలు చేయాలి,అని కోరారు. అలాగే ఆంధ్ర ప్రదేశ్ బ్రాడ్ కాస్టింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ కార్యదర్శి మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి, భద్రతకు ఈ చట్టాలు కీలకం అని వాటిని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫెడరేషన్ కార్యదర్శి పట్నాల సాయికుమార్, ఎన్.జె. శామ్యూల్, ఎస్.ఎస్.యస్. జహీర్, చి.మణికుమార్, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.ఇదే విధంగా ఎపిబిజెఎ గుంటూరు జిల్లా అధ్యక్షుడు బోస్కు సువర్ణ బాబు, కార్యదర్శి కేసంశెట్టి శ్రీనివాసరావు, బ్రహ్మం, దుర్గారెడ్డి, అయ్యప్ప, శ్రీనివాస్, నవీన్,

శశి, హెూసన్న ఇతర నేతలు పాల్గొన్నారు.

**చిత్తూరు**

కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన వర్కింగ్ జర్నలిస్ట్ యాక్ట్ 1955 వేతన సవరణ చట్టం 1958 ను వెంటనే పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్




వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ చిత్తూరు జిల్లా ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు చిత్తూరు గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు ఈ ధర్నాకు అన్ని ప్రజాసంఘాలు, కార్మిక సంఘాలు, ఉద్యోగ, ఉ పాధ్యాయ సంఘాలు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకులు కవరకుంట్ల జయరాజ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రద్దుచేసిన 44 కార్మిక చట్టాలలో జర్నలిస్టులకు సంబంధించిన రెండు చట్టాలు ఉన్నాయని తెలిపారు. అన్ని విభాగాల్లోని జర్నలిస్టులను ఒకే గొడుగు కింద తెచ్చే విధంగా వర్కింగ్ జర్నలిస్టు చట్టాన్ని అమలు చేయాలని జర్నలిస్టులు డిమాండ్ చేస్తుంటే ఆ చట్టాన్ని పూర్తిగా రద్దు చేయడం శోచనీయమన్నారు. వేతనాలకు సంబంధించిన 1958 వేతన సవరణ చట్టాన్ని కూడా రద్దు చేయడం జర్నలిస్టులకు కనీస వేతన సౌకర్యం కల్పించకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో జర్నలిస్టులు కీలక భూమిక పోషిస్తున్న నేపథ్యంలో వారిని పరిరక్షించాల్సిన ప్రభుత్వాలు వారి కడుపు కొట్టే విధంగా చట్టాలను రద్దు చేయడం దారుణం అన్నారు. మీడియా కమిషన్ ఏర్పాటు జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కోసం ప్రత్యేక చట్టాలను రూపొందించాల్సిన ప్రభుత్వాలు వాటిని తుంగలో తొక్కి నల్ల చట్టాలను తీసుకొస్తున్నారని ఆరోపించారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి ప్రకాష్ మాట్లాడుతూ జర్నలిస్టులకు అపారం నష్టం కలిగించే వర్కింగ్ జర్నలిస్ట్ చట్టం వేతన సవరణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం శోచనీయమన్నారు. జర్నలిస్టులకు మద్దతుగా ఏఐటియుసి నాయకులు నాగరాజు, సిఐటియు నాయకులు గంగరాజు, ఎస్టియు రాష్ట్ర నాయకులు గంటా మోహన్, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు రమణ తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

**కర్నూలు**

కేంద్రప్రభుత్వం 44 కార్మిక చట్టాల రద్దు చేసిన చట్టాల్లో జర్నలిస్టులకు సంబంధించిన రెండు చట్టాలు వర్కింగ్ జర్నలిస్టుల చట్టం 1955, వేతనాల చెల్లింపు చట్టం 1958 రద్దు మానుకోవాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి, రాష్ట్ర నాయకులు గోరంట్లప్ప, కేబి శ్రీనివాసులు,జిల్లా కన్వీనర్ నాగేంద్ర, ఫోటో గ్రాఫర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు హుస్సేన్, సీనియర్ జర్నలిస్ట్ సత్యనారాయణ




గుప్తా, వీడియో జర్నలిస్ట్ రాష్ట్ర నాయకులు హుస్సేన్ డిమాండ్ చేశారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ నగర అధ్యక్షుడు శివ శంకర్ అధ్యక్షతన నల్లబ్యాడ్జీలతో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ జర్నలిస్ట్ చట్టాలు రద్దు చేయడం మానుకోవాలని రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు ధర్నాలకు పిలుపునిచ్చారన్నారు. ఇప్పటికైనా కార్మికులను ఆదుకోవాలని ,జర్మలిస్టుల చట్టాలు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం స్పెషల్ కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతిని అందించారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు సునీల్ కుమార్, నగర కార్యదర్శి ఎర్రమల, ఫోటో గ్రాఫర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వడ్డే శ్రీనివాసులు, సీనియర్ నాయకులు రాజశేఖర్ నాయుడు, నగర ఉపాధ్యక్షుడు బాబు, నాయకులు చెన్నయ్య, అనిల్, మురళి, చంద్రశేఖర్, లక్ష్మయ్య,జర్మలిస్టులు పాల్గొన్నారు.

**ఏలూరు**

కేంద్రం రద్దు చేసిన రెండు కార్మిక చట్టాలు పునరుద్ద రించి కలం కార్మికులైన జర్నలిస్టులకు న్యాయం చేయాలని ఏపిడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె ఎస్ శంకర రావు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఇక్కడ కలెక్టరేట్ ధర్నాచౌక్ వద్ద ఎపి డబ్ల్యూజెఎఫ్




జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జలతో జర్నలిస్టులు నిరసన కార్యక్రమం చేపట్టారు. జిల్లా అధ్యక్షులు ఎస్ డి జబీర్ ఆధ్వర్యంలో జరిగిన నిరసన ప్రదర్శనలో సంఘాలకు అతీతంగా పాత్రికేయులు, రైతు సంఘ ప్రతినిధులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రద్దు చేసిన రెండు కార్మిక చట్టాలు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం పై వత్తిడి తెచ్చి పునరుద్దరణ జరిగేట్టు చూడాలని నినాదాలు చేశారు. అలాగే కూటమి ప్రభుత్వం ఎన్నికలు సమయం లో ఇచ్చిన హమీలు అమలు చేయాలని కోరారు. ఏలూరు జిల్లా ఫెడరేషన్ కార్యదర్శి హరీష్ జర్నలిస్టుల ఐక్యత గురించి మాట్లాడారు. సీనియర్ జర్నలిస్టు కె బాలశౌరి, ఎం. గంగరాజు, జయరాం, హరీష్, దాసు, మిల్టన్, దొరబాబు, సన్నీ, బాబ్జి, అర్జున్, నవీన్, ప్రతాప్, సత్యనారాయణ, శ్రీనివాస్, సజ్జి, రమేష్, షాజహాన్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

**విజయనగరం**

కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన జర్నలిస్ట్ చట్టాలు 1995, 1998 చట్టాలను పునరుద్ధరించాలని, వృత్తి ప్రమాణాలను, వేజ్ బోర్డు చట్టాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్



ఫెడరేషన్ విజయనగరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. చట్టాల రద్దుపై కేంద్ర వైఖరిని నిరసిస్తూ పెద్దపెట్టున నినాదాలు చేశారు ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రమేష్ నాయుడు మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టుల వృత్తి ప్రమాణాలు కాపాడేందుకు, వేతనాల చెల్లింపుకు, ఇతర సదుపాయాలకు, వేతన బోర్డుల ఏర్పాటుకు సంబంధించిన అంశాలపై ఈ చట్టాలు వర్కింగ్ జర్నలిస్టులకు ఏర్పాటును అందించే 1995, 1998 చట్టాలను రద్దు చేయడం దుర్మార్గం అని అన్నారు. మొత్తం మీడియాను ఒకే చట్ట పరిధిలోకి తెచ్చే విధంగా సరికొత్త చట్టాలు రూపొందించాల్సింది పోయి ఉన్న చట్టాలను రద్దు చేయడం ఎంత మాత్రం సరైన కాదని కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్. మురళి శంకర్రావు పత్తివాడ అప్పారావు బి.ప్రసాదరావు, గొర్లె సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

**అనకాపల్లి**




కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన జర్నలిస్టుల చట్టాలను తిరిగి పునరుద్దరించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు బి. వెంకటేష్ డిమాండ్ చేశారు. అనకాపల్లి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. రద్దు చేసిన చట్టాలను పునరుద్ధరించాలని, జర్నలిస్టులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, జర్నలిస్టులకు వేజ్ బోర్డు ఏర్పాటు చేయాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వెంకటేష్ మాట్లాడుతూ జర్నలిస్టులకు వేజ్ బోర్డు ఏర్పాటు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఒక పక్క పోరాటం చేస్తుంటే మరోపక్క కేంద్ర ప్రభుత్వం ఏకంగా ఈ చట్టాలను రద్దు చేయడం దారుణమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు శశి, నాగ, యూనియన్ నాయకులు అజయ్, శేఖర్ , గణేష్, గంటా శీను, సురేష్, రామకృష్ణ, నాగు, కోన లక్ష్మణ, నాయుడు, షణ్ముఖ, నానాజీ, హరికృష్ణ, శ్రీను, అప్పారావు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# మహా టివీ మీడియా హౌస్‌పై దాడి

మహాటివీలో ఫోన్ ట్యాపింగ్ వార్తల ప్రసారంపై ఆగ్రహించిన బిఆర్ఎస్ కార్యకర్తలు టీవీ కార్యాలయంపై దాడి చేసి విధ్వంసం సృష్టించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బిఆర్ఎస్ అగ్రనాయకుల ప్రమేయం గురించిన వార్తలు, చర్చలు మహాటివీలో జరిగాయి. దీనిపై ఆగ్రహించినవారు పెద్ద పెద్ద రాళ్ళతో విధ్వంసానికి పాల్పడడం, బీభత్సం సృష్టించడం, భయానక వాతావరణాన్ని కార్యాలయంలో పనిచేస్తున్నవారికి కల్పించారు. కార్యాలయంలోకి చొరబడి పూలకుండీలు పగులగొట్టడం మొదలుపెట్టి, కార్లను ధ్వంసం చేశారు. ఆఫీసు అద్దాలను, ఫర్నిచర్‌ను, కంప్యూటర్లను ధ్వంసం చేశారు. వారు సృష్టించిన భయానక వాతావరణంతో పనిచేస్తున్న సిబ్బందిలో కొందరు కార్యాలయంలోని గదుల్లో దూరి తలుపులు వేసుకున్నారు. ఈ దాడి ఒక ఉదాహరణ మాత్రమేనని మాజీమంత్రి జగదీష్ రెడ్డి వ్యాఖ్యానించారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు కె.టి.రామారావు స్పందిస్తూ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తమ పార్టీని అప్రతిష్ట పాలు చేసేందుకు ప్రయత్నిస్తున్న మీడియా సంస్థల పట్ల ఉపేక్షించబోమని, న్యాయపరమైన పోరాటం చేస్తామన్నారు. జరిగిన దాడిపై మాత్రం **నోరుమెదపలేదు.**




## తెలుగునాట నిరసన



**జర్నలిస్టుల ఖండన**

మహాటివీ మీడియా హౌస్‌పై దాడిని తెలుగు రాష్ట్రాల్లోని జర్నలిస్టులు తీవ్రంగా ఖండించారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్ ఈ దాడి మీడియాను భయపెట్టేందుకు ఉద్దేశించిందని అభిప్రాయపడ్డాయి. ఇది ముమ్మాటికీ మీడియా స్వేచ్ఛపై తీవ్రమైన దాడి అని, దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాల్లో జిల్లా శాఖలు ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించాయి.

పుంగనూరులో

మహా న్యూస్ ఛానెల్ కార్యాలయం పై దాడి ని ఖండిస్తూ పుంగనూరులో జిల్లా కమిటీ వర్కింగ్ ప్రసిడెంట్ గిరి శేఖర్, ఉపాధ్యక్షులు మహమ్మద్ సైఫుల్ల, నియోజకవర్గం అధ్యక్షులు సతీష్ కుమార్,వర్కింగ్ ప్రసిడెంట్ మురళి, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ సర్కిల్‌లో ధర్నా నిర్వహించారు. ధర్నా కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు జగదీష్, డిస్ట్రిక్ట్ ఎలక్ట్రానిక్ మీడియా సహాయ కార్యదర్శి జావీద్, మంజునాథ్, ఉపాధ్యక్షులు రెడ్డెప్ప, బాబు, కృష్ణమూర్తి, ట్రెజరర్ భాను ప్రకాష్, లీగల్ అడ్వయిజర్ శ్రీనివాసులు, కమిటీ సభ్యులు సతీష్, లవ కుమార్, కార్తీక్, పురుషోత్తం మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

**చిత్తూరులో**

హైదరాబాదులోని మహాన్యూస్ ఛానల్ ప్రధాన కార్యాలయంపై







భారత రాష్ట్ర సమితి ( బిఆర్ఎస్ ) పార్టీ నాయకులు, కార్యకర్తల దాడిని నిరసిస్తూ చిత్తూరు నగరంలోని గాంధీవిగ్రహం సర్కిల్‌లో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ( ఏపీడబ్ల్యూజేఎఫ్ ) ఆధ్వర్యంలో జర్నలిస్టులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకులు కవరకుంట్ల జయరాజ్, జిల్లా అధ్యక్షులు బి ప్రకాష్, జిల్లా కోశాధికారి కృపానందరెడ్డి, సంయుక్త కార్యదర్శి యాదవేంద్రరెడ్డి, ఏపీ బీజేఏ ( ఎలక్ట్రానిక్ మీడియా ) జిల్లా సంయుక్త కార్యదర్శి కమలాపతిరెడ్డి, ఏపీడబ్ల్యూజేఎఫ్ చిత్తూరు నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ కేశవులు, బాలసుబ్రమణ్యం, ఉపాధ్యక్షులు మురళీకృష్ణ, సంయుక్త కార్యదర్శి సురేంద్రరెడ్డి, ఉమాశంకర్, ఉదయ్ కుమార్, విజయ్ కుమార్, సీనియర్ నాయకులు ప్రజాశక్తి ప్రసాద్, సాక్షి మురళి, దాము, గోవర్ధన్, చిత్తూరు జిల్లా మహాన్యూస్ ఛానల్ స్టాఫ్ రిపోర్టర్ జయప్రకాష్ పాల్గొన్నారు.

**మహా న్యూస్ పై దాడి దుర్మార్గమైన చర్య**

ఫోన్ ట్రైపింగ్ అంశంపై వార్తలు ప్రసారం చేసిందన్న కారణంతో హైదరాబాద్ లో మహా న్యూస్ ప్రధాన కార్యాలయం మీద దాడి చేయడం దుర్మార్గమైన చర్య అని ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి, సీనియర్ జర్నలిస్టు రామాంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ సంచలనంగా మారిందని, ఇలాంటి సమయంలో మీడియా వార్తలు ప్రసారం చేయబోదని బీఆర్ఎస్ పార్టీ ఎలా భావిస్తుందని ఆయన నిలదీశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై వ్యతిరేక కథనాలు ప్రసారం చేసిందన్న కారణంగా మహాన్యూస్ ఛానల్ ఆఫీసుపై బిఆర్ఎస్ అల్లరిమూకలు దాడి చేసి కుర్చీలు, సోఫాలు, టేబుళ్ళతో పాటు కెమెరాలు, లైట్లు, అద్దాలను, కార్లను ధ్వంసం చేయడం ఏంటని ప్రశ్నించారు.

**ఏపీడబ్ల్యూజేఎఫ్ ఖండన**

మహా టీవీ కార్యాలయంపై దాడిని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ తీవ్రంగా ఖండించింది. మహా న్యూస్ ఛానెల్ ప్రధాన కార్యాలయంపై దాడి గర్హనీయమని మీడియాలో ప్రసారమయ్యే, ప్రచురితమయ్యే వార్తలు, కథనాలపై అభ్యంతరాలు ఉంటే నిరసన తెలపాలని,ఇందుకు భిన్నంగా దాడులకు పాల్పడటం సమంజసం కాదని ఏపీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షులు ఎస్.వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి జి. ఆంజనేయులు అన్నారు. మీడియా స్వేచ్ఛకు బాధ్యత వహించాల్సిన రాజకీయ పార్టీకి దాడులకు దిగడం ఎంతమాత్రం సమంజసం కాదన్నారు.

## మహిళా రిపోర్టర్‌పై కాల్పులు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అక్రమ వలసలపై తీసుకుంటున్న చర్యలకు వ్యతిరేకంగా లాస్ ఏంజెల్స్‌లో భారీ ఎత్తున ప్రజలు తరలివచ్చి నిరసనలు వ్యక్తం చేశారు. దీంతో ఏంజెల్స్ పోలీస్ డిపార్ట్మెంట్, నేషనల్ గార్డ్ దళాలు వారిని అడ్డుకునేందుకు రబ్బర్ బుల్లెట్లతో కాల్పులు జరిపారు. ఆ సమయంలో రిపోర్టింగ్ చేస్తోన్న ఓ మహిళా రిపోర్టరుపై ఓ జవాన్ రబ్బర్ బుల్లెట్తో కాల్చారు. ఈ ఘటన కెమెరాలో రికార్డయింది.

## సాక్షి రామకృష్ణ మృతి

విశాఖపట్నం జిల్లా గాజువాక నియోజకవర్గం అక్కిరెడ్డిపాలెం సాక్షి రామకృష్ణ మృతి చెందారు. ఆయన మరణవార్త తెలిసిన వెంటనే ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ కార్యదర్శి గంట్ల శ్రీను బాబు గాజువాక వెళ్ళి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.నారాయణ్, జి.శ్రీనివాసరావు, ఏపీ బీజేఏ జిల్లా కార్యదర్శి కె.మదన్, స్మాల్ అండ్ మీడియం న్యూస్‌పేపర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ రాజశేఖర్ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందచేశారు.



# వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ఉచితవిద్య

## కలెక్టర్‌కు ఏపీడబ్ల్యూజేఎఫ్ వినతి

కర్నూలు జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పోరేట్, పాఠశాలలో ఉచిత విద్యను అందించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషాకు ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కన్వీనర్ నాగేంద్ర, నగర గౌరవాధ్యక్షులు శివ కుమార్,నగర అధ్యక్షులు శివ శంకర్ ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వడ్డే శ్రీనివాసులు కలెక్టర్ కార్యాలయంలో వినతిని అందించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ నాగేంద్ర, మాట్లాడుతూ జిల్లాలో వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యను అందించాలని గతేడాది కలెక్టర్ ఆదేశాలతో 50 శాతం ఉచితంగా అందించారని తెలిపారు. సమాజంలో జర్నలిస్టుల పాత్రను గుర్తించి ఈ ఏడాది ఉచితంగా అందించాలని కనీసం 50 శాతాన్ని కల్పించాలని కోరారు.రాష్ట్రంలో కృష్ణ,ఏలూరు,విశాఖపట్నం జిల్లాలో 50 శాతం రాయితీ అందించాలని ఆయా జిల్లా కలెక్టర్లు ఆదేశాలు ఇచ్చారని కర్నూలు జిల్లాలో కూడా అదే తరహాలో ఇచ్చేలా అదేశించగలరని కలెక్టర్‌ని కోరామన్నారు. ప్రస్తుతం విద్య సంవత్సరం ప్రారంభం అయిందని అందుకు తగిన చర్యలు త్వరగా తీసుకోగలరని విజ్ఞప్తి చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ గతేడాది ప్రైవేట్ స్కూల్ వాళ్ళు కోర్టుకు వెళ్లారని కేవలం కర్నూలు జిల్లాలో మాత్రమే ఇలా జరిగిందన్నారు. అయితే సాధ్యమైనంతవరకు జర్నలిస్టుల పిల్లలకు రాయితీ అందించేలా డిఇఓతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

# కెడిసిసి బ్యాంక్ సీఈఓకు ఏపీడబ్ల్యూజేఎఫ్ అభినందన




కెడిసిసి బ్యాంక్ సీఈఓ పి.రామాంజనేయులు నూతన సీఈఓగా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు గోరంట్లప్ప, జిల్లా కన్వీనర్ నాగేంద్ర, ఫోటో గ్రాఫర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు డి హుస్సేన్, ఏపీడబ్ల్యూజేఎఫ్ నగర గౌరవాధ్యక్షులు శివకుమార్, నగర అధ్యక్షుడు శివశంకర్, నగర ప్రధాన కార్యదర్శి ఎర్రమల, ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వడ్డే శ్రీనివాసులు,ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు నర్సిరెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందించి శాలువాతో శుభాకాంక్షలు తెలిపారు. బ్యాంక్ అభివృద్ధికి మంచి తోడ్పాటు అందించి వరుసగా రాష్ట్ర అవార్డులు సొంతం చేసుకున్నారని అలాంటి అభివృద్ధి సాధించిన ఘనత సీఈఓ రామాంజనేయులు సాధించారని తెలిపారు. రైతులకు, విద్యార్థులకు, జర్నలిస్టులకు హౌసింగ్ లోన్‌లు,విద్యార్థులకు లోన్ అందించాలని కోరారు.

# జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించండి



విశాఖ జిల్లాలో జర్నలిస్టుల పిల్లలకు ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా ఫీజు రాయితీ కల్పించాలని కోరుతూ ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఏపీ బ్రాడ్‌కాస్ట్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ల అధ్వర్యంలో డీఆర్‌వో భవానీ శంకర్‌కు జూన్ 23న వినతిపత్రం సమర్పించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డీఆర్‌వోను ఫెడరేషన్ కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ జిల్లా అధ్యక్షుడు పి.నారాయణ్‌లు కలుసుకొని ఇప్పటికే ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలు అక్కడ జర్నలిస్టుల పిల్లలకు స్కూల్‌లో ఫీజు రాయితీపై ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందని వివరించారు. అలాగే వినతిపత్రంతో పాటు ఆయా జిల్లాలు జారీ చేసిన ఉత్తర్వుల ప్రతులను డీఆర్‌వోకి అందజేశారు. అక్కడి మాదిరిగానే విశాఖ జిల్లాలో జర్నలిస్టుల పిల్లలకు వంద శాతం రాయితీ కల్పించాలని కోరారు. అలాగే జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ కొన్ని స్కూల్స్ ఫీజు రాయితీ నిరాకరిస్తున్నాయని వీరు తెలియజేశారు. జర్నలిస్టుల వినతిపై డీఆర్‌వో సానుకూలంగా స్పందించారు. అక్కడే ఉన్న డీఈవో ప్రేమ కుమార్‌ను పిలిచి ఆయా ఉత్తర్వులు పరిశీలించి తక్షణమే జిల్లా కలెక్టర్‌కు ఫైల్ పంపాలని ఆదేశించారు. వీలైనంత త్వరలో ఇందుకు అవసరమైన ఉత్తర్వులు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే జర్నలిస్టులకు గతేడాది మాదిరిగానే ఉచితంగా వైద్య పరీక్షలు చేయించాలని కోరగా, ఈ విషయం కలెక్టర్ దృష్టిలో ఉందని, తదుపరి చర్యలు తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ విశాఖ జిల్లా కార్యదర్శి జీ. శ్రీనివాసరావు,డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎ.సాంబశివరావు, బ్రాడ్ కాస్ట్ విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ఇరోతి ఈశ్వరరావు, కింతాడ మదన్,ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు బండారు శివప్రసాద్,త్రినాధరావు, రాజశేఖర్,పిల్లా నగేష్ బాబు, పి.కామన్న తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య



గుంటూరు జిల్లాలో పని చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులు సమాజానికి, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచి నిస్వార్థంగా ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) మరియు ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్టింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ (ఎపిబిజెఎ) పేర్కొన్నాయి. జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఉచిత విద్యను కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా జీఓ జారీ చేసినప్పటికీ, దాన్ని జిల్లాలో పూర్తి స్థాయిలో అమలు చేయడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోనూ సంబంధిత అధికారులు కొన్ని సూచనలు, ఆదేశాలు జారీ చేసినప్పటికీ, చాలా ప్రైవేట్ విద్యా సంస్థలు వాటిని పాటించకపోవడంతో జర్నలిస్టులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ అంశంపై గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ అధికారి షేక్ ఖాజావలి (డిఆర్‌వో)కి జూన్ 4వతేదీ వినతిపత్రాన్ని అందజేశారు. జర్నలిస్టుల పిల్లలకు ప్రభుత్వం ప్రకటించిన ఉచిత విద్య హక్కు అందుబాటులోకి రావడానికి జిల్లా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు పట్నాల సాయి కుమార్, బోస్క సువర్ణ బాబు, శామ్యూల్, పుల్లారావు, శివ, సువర్ణ రాజు, తదితరులు పాల్గొన్నారు.

# టి న్యూస్ యాంకర్ స్వేచ్ఛ ఆత్మహత్య



టీ ఛానల్‌లో యాంకర్‌గా పనిచేస్తున్న స్వేచ్ఛ(35) జూన్ 27న ఆత్మహత్య చేసుకున్నారు. ఆమె చిక్కడపల్లి జవహర్‌నగర్‌లోని ఒక అపార్ట్‌మెంట్ పెంట్‌హౌస్‌లో నివసిస్తున్నారు. స్కూలు నుంచి తిరిగి వచ్చిన కుమార్తె ఇంటి తలుపులు తట్టినా తెరవకపోవడంతో పొరుగువారి సహాయంతో ఇంటి తలుపులు తెరిచి చూడగా ఇంట్లో అపస్మారకస్థితిలో స్వేచ్ఛ పడి ఉన్నారు. వైద్యచికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో తరలించే ప్రయత్నంలో అక్కడివి వచ్చిన వైద్యసిబ్బంది అప్పటికే మృతి చెందినట్టు ధృవీకరించారు. ఈ విషయం తెలిసిన వెంటనే చిక్కడపల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించారు. చురుకైన జర్నలిస్టుగా, రచయితగా పేరున్న స్వేచ్ఛ జూబిలీహిల్స్ జర్నలిస్టు సొసైటీ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యురాలు. జర్నలిస్టు ఉద్యమంలో చురుకైన పాత్ర నిర్వహిస్తున్నారు. స్వతహాగా ధైర్యవంతురాలైన స్వేచ్ఛ ఆత్మహత్య చేసుకునే బలహీన మనస్కురాలు కాదని, ఈ సంఘటనపై విచారణ జరిపితే నిజానిజాలు బయటకు వస్తాయని భావిస్తున్నారు. స్వేచ్ఛ మరణంపై తమకు అనుమానాలున్నాయని ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పూర్ణచందర్ అనే వ్యక్తి స్వేచ్ఛ ఆత్మహత్య కేసులో లాయరుతో కలిసి వచ్చి చిక్కడపల్లి పోలీసులకు లొంగిపోయారు. ఈ సంఘటన గురించి తెలిసిన వెంటనే హైదరాబాద్‌లోని జర్నలిస్టులు గాంధీ ఆసుపత్రికి చేరుకుని స్వేచ్ఛకు నివాళు లర్పించారు. సొసైటీ తరుపున మేనేజింగ్ కమిటీ నాయకులు గోపరాజు, హష్మి, చారి తదితరులు స్వేచ్ఛ కుటుంబ సభ్యులకు 50వేల రూపాయలు ఆర్థికసాయం అందజేశారు. స్వేచ్ఛ మృతి పట్ల నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్టు తెలంగాణ శాఖ కన్వీనర్ ఎం.ఎ.రవూఫ్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసి ఆమె కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

# విడియో జర్నలిస్టు శ్రీనివాస్ ఆత్మహత్య




తెలుగునాట మరో జర్నలిస్టు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా చనిపోయినట్లు బందువులు చెబుతున్నారు. ఈ సంఘటన సంగారెడ్డిలో జరిగింది. విడియో జర్నలిస్టుగా పనిచేసిన శ్రీనివాస్ ఆత్మహత్య తొలుత ఇంటి నుంచి వెళ్ళిపోయాడు. ఇరవై రోజుల తరువాత ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన ఆత్మహత్య చేసుకునేందుకు దారితీసిన పరిస్థితులపై బంధువులు తెలిపిన సమాచారాన్ని బట్టి ఆర్థిక సమస్యలు కారణమని భావిస్తున్నారు. శ్రీనివాస్ ఎక్స్‌ప్రెస్, మహా టివిలలో విడియో జర్నలిస్టుగా పని చేశాడు. ఇటీవల కాలంలో పెరుగుతున్న జర్నలిస్టుల ఆత్మహత్యలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని నేషనలణ అలయెనణ్స ఆఫణ జర్నలిస్టు తెలంగాణ శాఖ కన్వీనరణ ఎం.ఎ. రవూఫణ కోరుతున్నారు. శ్రీనివాసణ మృతి పట్ల నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్టు తెలంగాణ శాఖ తరఫున ఎం.ఎ.రవూఫ్ నివాళులర్పించి సంతాపం తెలియజేశారు.

# జర్నలిస్టుల సంక్షేమమే ఫెడరేషన్ లక్ష్యం



జర్నలిస్టుల సంక్షేమమే ఫెడరేషన్ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు బి ఈశ్వరరావు పేర్కొన్నారు. జూన్ 3వతేదీ అనకాపల్లి రోటరీ క్లబ్‌లో నిర్వహించిన అనకాపల్లి ప్రెస్ క్లబ్ (ఎఫ్) సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా నిలుస్తున్న జర్నలిస్టులకు ఫెడరేషన్ నిత్యం అండగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఫెడరేషన్ నిరంతర పోరాటాలు చేస్తుందన్నారు. ఇందులో భాగంగా అర్హులైన జర్నలిస్టులందరికీ సొంత ఇంటి కల నెరవేర్చేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. అలాగే అక్రిటేషన్ల విషయంలో చోటు చేసుకున్న పరిణామాలపై ప్రభుత్వానికి పలు సందర్భాలలో నివేదికలు అందజేసి అర్హులైన వారికి అక్రిడేషన్లు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన 44 చట్టాలలో రెండు చట్టాలు జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించినవి కాగా వీటి విషయంలో కేంద్ర ప్రభుత్వం తీరుకు వ్యతిరేకంగా ఈనెల 9న రాష్ట్రవ్యాప్తంగా ఫెడరేషన్‌లో కొనసాగుతున్న జర్నలిస్టులంతా ఐక్యంగా పోరాటాలు చేయనున్నట్లు చెప్పారు. జర్నలిస్టులు ఈ నిరసన కార్యక్రమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం అనకాపల్లి ప్రెస్ క్లబ్ సభ్యులకు ఐదు లక్షల రూపాయల ఇన్సూరెన్స్ బాండ్లను పంపిణీ చేశారు. జర్నలిస్టుల చిరకాల వాంఛ అయినా ఇళ్ల స్థలాలను సాధించుకునేందుకు సీనియర్ జర్నలిస్ట్ బి కొండలరావు నేతృత్వంలో




హౌసింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. అలాగే ఇటీవల జిల్లా కార్యవర్గానికి ఎన్నికైన ఫెడరేషన్ సభ్యులను ఘనంగా సత్కరించారు. తొలుత సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి ఈశ్వరరావును అనకాపల్లి ప్రెస్ క్లబ్ సభ్యులు శాలువాను కప్పి మెమొంటోను అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేష్, కార్యదర్శి ఖాదర్, ఏపీ బీజేఎ జిల్లా అధ్యక్షుడు ఎస్ కే చాంద్ భాషా, అనకాపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సిహెచ్ శశికుమార్, కార్యదర్శి పీల నాగ శ్రీనివాసరావు, ఉప కార్యదర్శి పెంటకోట సురేష్, కోశాధికారి మొల్లేటి గంగాధర్, ఫెడరేషన్ జిల్లా నాయకులు బి కొండలరావు, అజయ్, శేఖర్, కోరుబిల్లి గణేష్, నాగు తదితరులు పాల్గొన్నారు.

# ఈనాడు జర్నలిస్ట్ దత్తు రెడ్డి ఆకస్మిక మృతి



వరంగల్‌లో ఈనాడు స్టాఫ్ రిపోర్టర్‌గా పనిచేస్తున్న జీడిపల్లి దత్తురెడ్డి (37) గుండెపోటుతో ఆకస్మికంగా చనిపోయారు. విధి నిర్వహణ ముగించుకుని ఇంటికి వచ్చిన అనంతరం సేదతీరుతున్న సమయంలో గుండెపోటు వచ్చింది. వెంటనే వరంగల్‌లోని ఎంజిఎం ఆసుపత్రికి వైద్యచికిత్స కోసం తీసుకువెళ్లినప్పటికీ ఫలితం లేకపోయింది. కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని మద్దెలచెరువు గ్రామానికి చెందిన దత్తురెడ్డి 2015లో ఈనాడు దినపత్రికలో చేరారు. హైదరాబాద్, నల్లగొండలలో పనిచేసిన ఆయన గత యేడాది సెప్టెంబరులో వరంగల్లుకు బదిలీ అయ్యారు. ఆయన వివిధ అంశాలపై పరిశోధనాత్మక కథనాలు రాసారు. ఆయనకు భార్య ప్రియాంక, కుమారుడు శ్రేయాన్ష్ ఉన్నారు. నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్టు తెలంగాణ శాఖ కన్వీనర్ ఎం.ఎ.రవూఫ్ దత్తురెడ్డి మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబసభ్యులకు సానుభూతిని తెలియజేశారు.



# సీనియర్ జర్నలిస్టు రవి మృతి

సీనియర్ జర్నలిస్టుగా హైదరాబాద్‌లో పనిచేసిన జి.రవి అమెరికాలోని డల్లాస్‌లో మరణించారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేసిన ఆయన అమెరికాలో తన కుమార్తెతో కలసి గడిపేందుకు వెళ్లి అక్కడ మృతి చెందారు. ఆయన అంత్యక్రియలు డల్లాస్‌లోనే జరిగాయి. రవి మరణం పట్ల నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్టు తెలంగాణ శాఖ కన్వీనర్ ఎం.ఎ.రవూఫ్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

# కంచర్ల రామయ్య కన్నుమూత



ప్రకాశం జిల్లాకు చెందిన విద్యావేత్త, సీనియర్ జర్నలిస్ట్ కంచర్ల రామయ్య ఆకస్మికంగా మరణించారు. ఆయన సుదీర్ఘకాలం జర్నలిస్టుగా ఈనాడు దినపత్రికలో పనిచేశారు. అనంతర కాలంలో విద్యావేత్తగా మారి ఇంజనీరింగ్ కళాశాల స్థాపించి జిల్లాలో విద్యాభివృద్ధికి కృషి చేశారు. జర్నలిస్టుగా పనిచేసిన సమయంలో యూనియన్ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొన్నారు. మూసివేసిన ఆంధ్రపత్రిక దినపత్రికను తిరిగి తీసుకువచ్చేందుకు తన వంతు కృషి చేశారు. ఒంగోలులో జర్నలిస్టుగా పనిచేసిన కాలంలో ఆ ప్రాంత సమస్యల పరిష్కారం కోసం అహరహం శ్రమించారు. జిల్లాలో విద్యారంగ అభివృది&ధకి అవిరళ కృషి చేశారు. ప్రకాశం జిల్లా ఫెడరేషన్ నాయకులు కంచర్ల రామయ్య అంత్యక్రియల కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గొట్టిపాటి నాగేశ్వరరావు, ఎస్.వి.బ్రహ్మంలు కంచర్ల రామయ్య మృతికి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసి వారి కుటుంబసభ్యులకు తమ సానుభూతిని తెలియజేశారు

## గుండెపోటుతో సురేష్ మృతి



పాతికేళ్ళుగా జర్నలిస్టుగా పనిచేస్తున్న ప్రజా దర్బార్ పత్రిక రిపోర్టర్, ఉప్పల్ ప్రెస్ క్లబ్ సభ్యుడు మాదిరాజు సురేష్ గుండెపోటుతో అకాల మరణం చెందారు. ఆయన మరణం జీర్ణించుకోలేనిది. సురేష్ పలకరింపు, ఆప్యాయత మరువలేనిది. నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి పాటు పడే సురేష్ మరణం అత్యంత బాధాకరమైంది. ఆయన మృతి పట్ల నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్టు (ఎన్.ఎ.జె) తెలంగాణ కన్వీనర్ ఎం.ఎ.రవూఫ్ సంతాపం తెలియజేశారు. ఆయన కుటుంబ సభ్యులుకు ప్రగాఢ సానుభూతి తెలియచేశారు.



## పాత్రికేయం సంపాదకుడు శ్రీనివాస్ మృతి

సీనియర్ జర్నలిస్టు,పాత్రికేయం దినపత్రిక ఎడిటర్ పి. శ్రీనివాస్ అనా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. ఆయన వయసు 53 సంవత్సరాలు. అతనికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు. దాదాపు ఇరవై ఐదేళ్లుగా వివిధ పత్రికల్లో పని చేసి తన సొంత పత్రిక నడుపుతున్న శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా తన పత్రికను నిరంతరంగా కొనసాగిస్తూ వస్తున్న శ్రీనివాస్ అకాల మరణం బాధాకరం. ఆయన మృతి పట్ల నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్టు (ఎన్.ఎ.జె) తెలంగాణ కన్వీనర్ ఎం.ఎ.రవూఫ్ సంతాపం తెలియజేశారు. శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## హేలాపురి న్యూస్ విలేకరి మృతి



తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండల హేలాపురి న్యూస్ విలేకరిగా పనిచేస్తున్న దిగురుపల్లి గాబ్రియల్ మృతి చెందారు. ఆయన అనారోగ్యం పాలుకావడంతో రాజమండ్రిలోని సెయింట్ జోసెఫ్ ఆసుపత్రిలో చేర్చారు. శ్వాస తీసుకోలేని పరిస్థితులలో వెంటిలేటర్ పై కృత్రిమ శ్వాస పొందుతూ మరణించారు. ఆయన మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ తూర్పుగోదావరి జిల్లా ఇన్‌చార్జ్ శ్రీనివాసరావు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. గాబ్రియల్ కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

## జర్నలిస్టు నరసింహులు మృతి

మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రజాశక్తి నుండి నవతెలంగాణ, మన తెలంగాణ, సూర్య, పలు ప్రధాన పత్రికలో పనిచేసిన జర్నలిస్ట్ దాసరి నరసింహులు ( లెనిన్ ) మృతి చెందారు. దాసరి నరసింహులు జర్నలిస్టుగా విధి నిర్వహణలో ఉండి భోజనానికి ఇంటికి వెళుతూ అమరులయ్యారు. దాసరి నరసింహులు చనిపోవడం జర్నలిస్టు లోకానికి తీరనిలోటు. నరసింహులు మృతి పట్ల నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్టు తెలంగాణ శాఖ కన్వీనర్ ఎం.ఎ.రవూఫ్ సంతాపం వ్యక్తం చేసి వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

## సీనియర్ పాత్రికేయుడు రమణ మృతి

సీనియర్ పాత్రికేయుడు ఎస్.వి.రమణ మరణించారు. దాదాపు పదిహేను సంవత్సరాలుగా జర్నలిస్టుగా పనిచేస్తున్న రమణ మృతి ఆయన సన్నిహితులను కలిసివేసింది. రమణకు భార్య,ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతి పట్ల నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్టు తెలంగాణ శాఖ కన్వీనర్ ఎం.ఎ.రవూఫ్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబసభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

S A V E JOURNALISM

# వర్కింగ్ జర్నలిస్టుల చట్టం 1955, వేతనాల చెల్లింపు చట్టం 1958 పునరుద్ధరించాలని కోరుతూ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో జరిగిన ఆందోళన కార్యక్రమాలు

P R O T E C T JOURNALIST






కర్నూలులో


కర్నూలులో


ఒంగోలులో


విజయనగరంలో














ఫెడరేషన్ ఆధ్వర్యంలో
రాష్ట్రవ్యాప్తంగా జూన్ 11న వివిధ
జిల్లాల్లో జర్నలిస్టుల డిమాండ్స్ డే
నిర్వహించిన దృశ్యాలు